# మంచం కింద మరచెంబు

మనుష్యులలో పంచలు కట్టుకునేవారి దగ్గర్నుంచి పంట్లాములు వారివరకూ వున్నారు. స్త్రీలలో పరికిణీలనుంచి పట్టు చీరలు కట్టేవారి వరకూ వున్నారు. అలాగే మరచెంబుల్లోనూ నానాజాతులవీ వుంటూవస్తున్నాయి, కొన్ని వెండివీ, కొన్ని కంచువీ మరికొన్ని ఇత్తడివీ సత్తువీ స్టీలువీ కూడా వస్తున్నాయి. చెంబు అనేది అంతర్ధానమయితే దాదాపు తెలుగు జీవితం తాలూకు మంచి జ్ఞాపక వస్తువు మనకు లేకుండా పోయినట్టే.

'అమ్మాయీ మరచెంబు పట్టికెళ్లు,' – "అయ్యో మరచెంబు దిగిందో లేదో చూసుకోండ్రా – ఈ మరచెంబుతో నీళ్లు తెచ్చి పెడతారా" – యిటు వంటి అనేకానేక డైలాగులు మనకు మరి వినిపించవు.

మరచెంబు వుండాలా అక్కర్లేదా అనేదియిప్పుడు టుబీ ఆర్ నాట్ టుబీ అన్న క్వశ్చను. మరచెంబుతో నీళ్లు తీసుకుని కథానాయిక పడక గదిలో ప్రవేశించును. మరచెంబుల్లో గుండ్రటివి వున్నాయి. పలకలవీ వున్నాయి. క్రింద సన్నగా పైన పొడుగ్గా వయ్యారంగా నిలబడేవి వున్నాయి. మా యింట్లో వెనక మరచెంబుకు తేలుకుట్టింది. డోంట్ లాఫ్ టేకిట్ సీరియస్లీ. మరచెంబులకే కాదు మంచినీళ్ల బిందెలకు కూడా తేలుకుడితే కన్నం పడిపోవాల్సిందే. మా గ్రాండ్ మదర్ చెప్పింది. తేలు కంచు చెంబునుగాని ఇత్తడి చెంబునుగాని కుట్టగలదా అన్నది శాస్త్రజ్ఞులు తేల్చ వలసిన ప్రశ్న. కథకులు రచయితులు దీనిని తేల్చజాలరు. తేలును మనం కంచు చెంబులో పడవైచి దానికి ఆహార మివ్వకుండా ఒకరోజు కంచు చెంబు యాత్రికునిలా దాని నందులో మసలనిస్తే అది కంచెంబును కసిదీరా కుట్టును, కుట్టదుపో శాస్త్రజ్ఞుడే గెల్చును. కవి యూహ తల్ల క్రిందులగును. మాచిన్నప్పుడు మేము తేలుకు కొండె కత్తిరించి దానిని తాడుకట్టి అగ్గిపెట్టెను అలమరలో పెట్టి దానిని ఎవరు తీస్తారా అని చూస్తూ నిరీక్షణలో గంటలకు గంటలు గడిపేవాళ్ళం. నాకెప్పుడూ తేలు కుట్టలేదు. మా వారికి బోర్ల పడుకుని చదువుకుంటూ వుండగా పైనుంచి రాలి మెడమీద త్రోసివేయబోగా చేతిమీద ఒక్కసారే రెండుచోట్ల కుట్టింది. అప్పుడు ఇగ్నీషియా టూ హండ్రెడ్ వేసుకోగా మావారు చిరునవ్వులు నవ్వుతూ చాపమీద లేచి నిలబడ్డారు. తేలు కుట్టిన తరువాత చిరునవ్వు నవ్వుతూ లేచి నిలబడాలంటే ఇగ్నీషియా టూ హండ్రెడ్ పొటెన్సీ వాడండి. మీకు తేలు కుట్టలేదా అయితే మీ ఖర్మ. మీరు నవ్వకండి మరచెంబుకు కుడితే మనలను కుట్టినట్లే. మరచెంబులో నీళ్ళు కారిపోతాయి. అక్కడ సున్నిపిండో చింతపండో సబ్బుముక్కో పెట్టాలి.

మరచెంబుని మూడు భాగాలుగా చేయవచ్చు. ఒకటి మూత. దీనినే మరమూత, మరచెంబు మర అని కూడా అంటారు. ఈ మూతపైన పట్టుకునే హాండిల్వుంటుంది. అది వూడిపోతే మరచెంబు అప్పుడు నాలుగు భాగాలవుతుంది. మరచెంబులో చిన్నగ్లాసు వుంటుంది. అది

ముద్దొస్తూ వుంటుంది. సరిగా తోమకపోతే కిలం పట్టి ఆకుపచ్చ కలర్‌లో దర్శనమిస్తుంది. ఇకపోతే మరచెంబు లోపలా బయటా అని ఒకేశాల్తికి రెండురూపాలు. పనిచేసేది పైన తోవితేలోపల తోవదు. పైనదాసీది, లోపల మనమూ మరచెంబును తోముకోవాలనిరూలు. వేలుపెడితే చెంబులో లోపలజిగురు జిగురుగా అంతర్భాగము తీగలు సాగితే ఆ మరచెంబును కొబ్బరి పీచుతోగాని బీరకాయపీచుతోకాని తోమాలి. అలా చేయక పై పైన తోమి శుభ్రపరుస్తూ వుంటే లోపలంతా ముందు పచ్చబడి తర్వాత నల్లగా అయిపోతుంది. అందులో ఏం వేసినా హాలాహలమైపోతుంది. మరచెంబు ఎప్పుడూ ఆడవారి చేతికే శోభనిస్తుంది. అది చేతిలో వున్నంత సేపూ పర పురుషుడెవరూ ధైర్యంచేసి మనకేసన్నా చూడడు. మరచెంబు విసిరేస్తే సొట్టలు పడిపోవచ్చుగాక, ఎటువంటి మొహమైన ప్రేలిపోతుంది, ఆత్మ సంరక్షణార్థం మరచెంబు ఒక అత్యవసరమైన ఆయుధం. ఆ మరచెంబు మూత లోపలి గ్లాసు యివి రెండూ ఎప్పుడు కనపడవు. మేం ఒహప్పుడు వెండి మరచెంబుకు మూతెందుకని అదిచెరిపించి మా పాపకు పట్టాలు ఉగ్గుగిన్నె, పాల చెంబు చేయించాము. ఒక పట్టా పోయింది. పాల చెంబుకి కొమ్ము విరిగింది. ఉగ్గు గిన్నె కాకెత్తుకు పోయింది. దీని మొహం తగలెయ్యా అవన్నీ చెరిపించి మరోపత్తులాలు వేసి మావారికి పలకల వెండి గ్లాసుకొని పుట్టిన రోజునాడు బహూకరించాను. మజూరి పదహార్రూపాయలయినందుకు వారు మూతి ముడుచుకున్నారు. ఒక మరచెంబు మనింట్లో వుంటే ఎన్ని సరదాలైనా తీర్చుకోవచ్చును. అది చెరిపించి మళ్ళీచెరిపించి ఎన్నైనా చేయించుకోవచ్చు. కొంచెం మజూరీ దగ్గరే మనకూ అయ్యగారికి బెడిసి కొట్టవచ్చు.

పడగ్గదిలో పందిరిమంచం వుంటుందిగదా.

ఆ మంచం క్రింద కూజా బిందెతో నీళ్ళు పెట్టుకోముగదా, వెనకటికోమారు "మంచం క్రింద మరచెంబు అందుకోవే" అంటే నిద్రకళ్ళతో మంచంమీంచి వంగబోయి నేలమీదకు బోర్లపడ్డాను, ఇటువంటివి జరగకుండా తరవాత్తరవాత కిటికీలో మరచెంబు పెట్టడం ప్రారంభించాను. కాని మర తిప్పకుండా గ్లాసు అందులో వేసి వుంచటం వలన నిద్రలో మావారొకసారి చెంబుని తన్నేశారు. పక్కంతా తడిసిపోయింది. వర్షం వచ్చిందా అని మాకు అనుమానం వేసి రేప్రొద్దున పక్కింటి వాళ్ళని అడిగితే తెలిసిపోతుంది లెమ్మని మళ్ళీ నిద్రపోయాము. ఆ నీళ్లు పరుపులోంచి యింకి పరుపుకింద పెట్టిన పేరంటానికి కట్టుకుని వెళ్ళవలసిన పట్టుచీరకాస్త తడిసిపోయింది. సరే ఏం చేస్తాం - ఆ మర్నాడు పరుపుని దిళ్ళను తీసికెళ్లి డాబామీద ఎండలో ఆరేశాం. పక్కవాళ్ళని ఏమండి నిన్నరాత్రి వర్షం కురిసిందా అని అడిగాం. లేదమ్మా అంది ఆవిడ నవ్వుతూ. ఆవిడనిజం చెప్పటం లేదేమోనని మావార్ని మొగవాళ్ళని కనుక్కోండి అనిమోచేత్తో పొడిచాను. ఆయన షర్టువేసుకుని అలా వీధిలోకెళ్ళొచ్చి నిన్నరాత్రి వర్షం కురిసిందని ఎవరూ చెప్పటంలేదే అన్నారు బిక్కమొగం వేసుకుని, ఈ లోకంలో ఎవరూ నిజంపలకరు అందుకని ఆరోజునుంచీ మరచెంబు కాళ్ళ దిక్కు కిటికీలో పెట్టకుండా మంచం క్రింద పెడుతూవచ్చాను. కొంచెం ఎత్తుగా పీటవేసి ఆపీటమీద మరచెంబు పెట్టాక

"అది చేతికందేలా పెట్టాలే" అన్నారు మావారు. చేతికందెలా పెడితే దాన్ని నిద్దట్లో చేత్తోతోసెయ్యచ్చు. చేతికందకుండా పెడితే నేను అది తీయబోయి నిద్దట్లో బోర్లపడవచ్చు కిటికీలో పెడితే వర్షం వచ్చిందో లేదో తెలుసుకుందుకు సోదికెళ్ళాలి. ఇన్ని చిక్కు సమస్యలతో మంచం క్రింద మరచెంబు నన్ను నానాయాతన పెట్టింది. రైల్లోనూ అంతే మరచెంబుని ఎంతసేపని ఒళ్ళోపెట్టుకు కూర్చుంటాం. పక్కన పెడితేయిటూ అటూ కదిలినప్పుడు గుచ్చుకుంటుంది. క్రిందపెడితే రైలుకుదుపుకి అది తిరగబడి నీళ్ళన్నీకారిపోయి పక్కవాళ్ళ బెడ్డింగ్ క్రిందకు చేర్తాయి. మరచెంబును ఎక్కడ పెట్టాలి, ఎలా పట్టుకోవాలి. ఎవరుపట్టుకోవాలీ అనేవి చాలా కఠినమైన ప్రశ్నలు.

ప్రయాణాల్లో మరచెంబులు పోతూవుంటాయి. పోతే ఫరవాలేదని వూరుకోగలమా? మరచెంబు చుట్టూవున్న జ్ఞాపకాలు మనల్ని మరీ మరీ బాధించి వేధించి చంపుతాయి, మరచెంబు మూతితో వక్కలు కొట్టొచ్చు. కొబ్బరిచెక్క కొబ్బరి ముక్కలుతినొచ్చు. మర్చిపోయాను, బోయినాలకు ఎవరింటికేనా వెళ్లినప్పుడు మరచెంబులో బూర్లు, లడ్డుకుక్కుకుని రావచ్చు.

మా యింట్లో యిపుడు వెండి మరచెంబులేదు. నాకు టైఫాయిడ్ వచ్చినప్పుడు దానికి కాళ్ళొచ్చి యింట్లోంచి నడిచి వెళ్లిపోయింది. మళ్ళీ మళ్ళీ కొనుక్కోలేముకదా – అప్పుడు నాపెళ్ళికి పెట్టిన ఆ వెండి మరచెంబు ఆ వెధ్రిముండ యిప్పుడు ఎవరి మంచం క్రిందవుందో గదా అని అనిపించినపుడు నాకళ్ళు చెమ్మగిల్లుతాయి. అష్టరాల్‌చెంబు – కాని చెంబుచుట్టూ ఎంత జీవితం తిరిగింది? చెమ్చాల గురించి మరోమాటు చెప్తాను.

# పరుపుక్రింద పైజమ్మా

మొన్న మా పిన్నిగారి లలిత ఒంటరిగా బస్సులో వచ్చింది పుట్టింటికి ధూళి ధూసరితలతాంగిలా, బస్సు జర్నీకదా పాపం మొహం కళ్ళూ వాచాయి అనుకున్నాం. అదేంకాదు. దానికి ఆరోనెలలో ఏడోనెలోట – అక్కవుంటెన్నీ తెలీదు. దానికథ విన్నాక నాకు ఏడుపొచ్చింది. దాని మొగుడు బియస్సీ ఎల్లెల్బీట, ఏనుగుగున్నలా వుంటాడు. ఏడువేలు కట్నం పోశారు, మనిషి ఏనుగుగున్నలా వున్నా మొహం ముంగిమొహంట. క్యాంపులమీద తిరిగే వుద్యోగం – నెల్లో యిరవై య్యాద్రోజులు కమాను. మా లలిత మా లలితని చెప్పుకోవటం కాదుగాని కాపురాని కెళ్ళినప్పుడు అది లప్లీగా, నైసుగా, షోగ్గా, చలాకీగా, రంగుల రాణీలా వుండేది. చెప్పాను కదా దాని మొగుడు దిబ్బకొక్కులా ముంగిలా, ఏనుగులా వుంటాడని వాడి కది నవల్సూ పత్రికలు చదివితే చెడిపోతుందని భయంట. సీతారామాంజనేయ యుద్ధం, మోహినీరుక్మాంగద అనుపాము పాటకథ, లక్ష్మణస్వామి మూర్ఛలాటి కథలుచదువుకోమంటాడ్ట.